
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 23 అక్టోబరు 2024



ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐదో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. 'ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలి. సర్టిఫికెట్లను ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27లోగా పరిశీలన చేయించాలి. ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 28న, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న ఐటీఐకు నిర్దేశించిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి' అని సుధాకరరావు తెలిపారు.

రణస్థలంలో భారీ ఫ్లై ఓవర్

- రెండు కిలోమీటర్ల వంతెన
- 800 మీటర్లు ఓపెన్‌గా..
- జనవరి నుంచి పనులు ప్రారంభం
- వైసీపీ చేయలేని పని కూటమి సర్కారు వచ్చాక కదలిక
- కేంద్రంపై ఎమ్మెల్యే, ఎంపీ ఒత్తిడి



రణస్థలం వద్ద జాతీయ రహదారి

రణస్థలం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జనవరి నుంచి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసింది. టెండర్ల ప్రక్రియ సైతం దాదాపు కొలిక్కి వచ్చింది. ఇక్కడ నిర్మించే ఫ్లైఓవర్ జాతీయ రహదారులకు సంబంధించి అతి పెద్ద వంతెనల్లో ఒకటిగా నిలవనుంది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ కొనసాగుతుంది. మరో 800 మీటర్ల వరకూ ఓపెన్ ఫ్లైఓవర్ నిర్మించే అవకాశముంది. రణస్థలం సర్వీసు రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకూ ఫ్లైఓవర్ వస్తుంది. 45మీటర్ల పరిధిలో పనులు జరుగుతాయి. కొన్నేళ్ల కిందట నరసన్నపేట వరకూ ఆరులేన్ల రహదారి విస్తరణ జరిగినా.. రణస్థలం మండల కేంద్రం వద్ద అలానే వదిలేశారు. దీంతో మండల ప్రజలకు ఎదురుచూపులు తప్పలేదు.



దన్నానపేట పెట్రోల్ బంకు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న హైవే అధికారులు

ఇదీ పరిస్థితి..

విశాఖ నుంచి నరసన్నపేట వరకూ దాదాపు 135 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని ఆరు లేన్లగా విస్తరించారు. కానీ ఒక్క రణస్థలం మండల కేంద్రాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టారు. ఆరు లేన్ల రహదారి నిర్మాణం పూర్తయింది. దీనిని జాతికి సైతం అంకితం చేశారు. కానీ రణస్థలం విషయంలోకి వచ్చేసరికి మాత్రం ఆరేళ్లుగా సందిగ్ధత కొనసాగుతోంది. మండల కేంద్రాన్ని తప్పించి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అలాగని ఫ్లైఓవర్ నిర్మించలేదు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలం మండల కేంద్రాన్ని తప్పించి బైపాస్ రోడ్డు నిర్మాణానికి 2016లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటి కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు, స్థానిక ఎమ్మెల్యే కళా వెంకటరావు కృషి మేరకు.. దన్నానపేట నుంచి లావేరు మండలం రావివలస వరకూ 3.5కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణానికి నిర్ణయించారు. సుమారు 66 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. భూసేకరణ కూడా చేపట్టారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, ఎచ్చెర్లలో సేకరించిన (మిగతా 6వ పేజీలో...)

రెండేళ్ల కిందట సన్నాహాలు..

రెండేళ్ల కిందట రణస్థలం వద్ద రూ.200 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేశారు. టెండర్ల ప్రక్రియ ఖరారు అయినట్టు ప్రకటించారు. కానీ ఎందుకో పనులు ప్రారంభించ లేదు. అప్పట్లో వైసీపీ పాలకులు సైతం పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో స్థానిక ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఒత్తిడి చేయడంతో జాతీయ రహదారుల అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. వాస్తవానికి ఫ్లైఓవర్ నిర్మాణంతో రణస్థలం ప్రాభవం కోల్పోతుందని స్థానికులు, వ్యాపారులు ఆందోళన చెందుతూ వచ్చారు. ఇక్కడ ఫ్లైఓవర్ వద్దంటూ ఆందోళనలు కూడా చేశారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపై ఒత్తిడి కూడా పెరిగింది. ఈ తరుణంలో అటు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు వ్యాపారులకు ఇబ్బంది లేకుండా ఉండేలా వంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలుమెట్ట తరహాలో భారీ స్తంభాలతో వంతెన ఏర్పాటుకు నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు మంగళవారం దన్నానపేట పెట్రోల్ బంకు వద్ద రోడ్డును హైవే అధికారులు పరిశీలించారు. కింద వ్యాపారాలకు అడ్డంకి లేకుండా.. వంతెనపై లారీలు, అంతర్ రాష్ట్ర వాహనాలు వెళ్లే వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. మొత్తానికి సీఎం చంద్రబాబు హయాంలోనే రణస్థలానికి ఫ్లైఓవర్ మంజూరు కావడం, నిర్మాణం సైతం ప్రారంభించనుండడంతో ఈ ప్రాంతీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇసుక... ఉచితమే!

- తవ్వకాలకు ప్రదేశాల గుర్తింపు
- ట్రాక్టర్లు, ఎద్దుల బళ్లకు అవకాశం

మెళియాపుట్టి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో గత ఐదేళ్లూ ఇసుక అక్రమాలతో రూ.కోట్లు కూడబెట్టుకున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని వంశధార, మహేంద్రతనయ నదుల్లో ఇసుకను గ్రామస్థాయి వైసీపీ నాయకులు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టింది. కాగా కొంతమంది కూటమి నాయకులు సైతం ఇసుక విక్రయాలు సాగిస్తున్నట్టు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 18న అమరావతిలో సీఎం చంద్రబాబు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇసుక ఉచిత విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని (మిగతా 6వ పేజీలో...)

ఐదేళ్లు షెడ్‌లో ఉంచాం

అప్పు చేసి రూ.10లక్షలతో ట్రాక్టర్ కొన్నాను. గత ఐదేళ్ల పాటు ఇసుక రవాణా చేసుకోనే అవకాశం లేక ట్రాక్టర్ షెడ్‌లోనే ఉంచాం. దమ్ములు, దుక్కికి మాత్రమే వినియోగించాం. కూటమి ప్రభుత్వం.. ఉచితంగా ఇసుక తరలించే అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉంది. గతంలో మా గ్రామంలో సుమారు 40 ట్రాక్టర్లు ఉండగా.. ప్రస్తుతం పదే ఉన్నాయి.

- ఎన్.ఉమాపతి, ట్రాక్టర్ యజమాని, జలగలింగుపురం, మెళియాపుట్టి

కార్మికులకు కూలి దొరుకుతుంది

ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. ప్రస్తుతం ఎక్కడ ఇసుక దొరుకుతుందో అక్కడ తీసుకునే వెసులుబాటు ఇవ్వడం వల్ల ఆనందంగా ఉంది. ప్రతిరోజు కూలి దొరుకుతుంది.

- నిరంజన్, మేస్త్రీ, మెళియాపుట్టి

దిద్దుబాట్లు

- గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వేలో తప్పులు
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- రెవెన్యూ సభల్లో అర్జీల వెల్లువ



యారబాడు గ్రామసభలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నరసన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వేలో జరిగిన తప్పులు సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రీ సర్వే జరిగే గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ అధికారులు గ్రామసభలు ప్రారంభించారు. ఈ నెల 25 వరకూ వీటిని నిర్వహించి.. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. కాగా.. తొలిరోజు గ్రామసభకు అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 1,200 అర్జీలు వచ్చాయి. రీ-సర్వే సమయంలో భూముల విస్తీర్ణం పరంగా తక్కువగా నమోదు చేశారని.. న్యాయం చేయాలని పలువురు దరఖాస్తు చేశారు. రెవెన్యూ గ్రామానికి సంబంధించి ఒకే వ్యక్తికి ఎక్కువ ఖాతాలు ఇస్తే.. వాటిని ఒకే ఖాతాగా మార్పు చేయాలని మరికొందరు కోరారు. మృతి చెందిన పట్టాదారుల భూమిని.. తమ పేరుతో మార్పు చేయాలని తగిన ఆధారాలతో వారసులు దరఖాస్తు చేశారు. భూ వర్గీకరణకు సంబంధించి తప్పుగా ఉంటే వాటిని మార్చడం, జాయింట్ ఎల్‌పీఎంగా నమోదైన వాటిని కూడా సబ్‌డివిజన్ చేసి సమస్య పరిష్కరించాలని మరికొందరు విజ్ఞప్తి చేశారు. రికార్డుల్లో పేర్లు తప్పుగా నమోదయ్యాయని.. వాటిని సరిచేయాలని ఇంకొందరు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నరసన్నపేట మండలం యారబాడులో నిర్వహించిన గ్రామసభలో సుమారు 120 మంది రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఇలా ప్రతి మండలంలోనూ గ్రామసభల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

45 రోజుల్లో పరిష్కారం..

గ్రామసభల్లో వచ్చిన వినతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని రెవెన్యూ అధికారులు తెలిపారు. 'సరైన పత్రాలు సమర్పిస్తే.. మండల పరిధిలోనే వాటిని పరిష్కరిస్తాం. కొన్ని జేసీ దృష్టికి తీసుకెళ్తాం. ఇంకా పెద్ద సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరిస్తామ'ని వారు వివరించారు. రైతులు భూముల రికార్డుల తప్పుల సవరణకు ఈ సభలు వినియోగించుకోవాలని సూచించారు.

పేరు తప్పుతో రుణం రాలేదు..



పాస్ పుస్తకంలో నా పేరు యారబాటి వెంకటప్పుడుగా నమోదైంది. గత మూడేళ్లుగా బ్యాంకుల చుట్టూ రుణం కోసం వెళ్లినా.. పాస్‌బుక్‌లో పేరు మార్చుకుని రావాలన్నారు. ఈ గ్రామ సభల ద్వారా పేరు మార్పునకు అవకాశం లభించింది. అలాగే రెండు ఖాతాల్లో ఉన్నట్టు చూపుతున్నాయి. ఒకే ఖాతా చేయాలని అర్జీ ఇచ్చాను.

- యారబాటి వెంకటరమణ, యారబాడు, నరసన్నపేట

ఉన్న భూమి తొలగించారు..



గ్రామంలో 33-2లో ఉన్న 0.96 సెంట్ల భూమిని రీ-సర్వే సమయంలో తొలగించారు. వారసత్వంగా లభించే భూమి రికార్డుల్లో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. ఈ సమస్య పరిష్కారానికి అర్జీ చేశాం. రీ-సర్వేలో తప్పులపై గ్రామసభలు నిర్వహించి సమస్యలు పరిష్కరించడం హర్షణీయం.

-లబ్బ అమ్మన్న, యారబాడు, నరసన్నపేట



నరసన్నపేట సర్కిల్ కార్యాలయంను పరిశీలిస్తున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- డీఐజీ గోపినాథ్ జెట్టి

8లో



కేజీబీవీలో సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ అవతారం

కేజీబీవీ విద్యార్థినుల ఆచూకీ లభ్యం

- ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో గుర్తింపు

8లో

హై అలర్ట్



ఉద్దానంలో తితలీ తుఫాన్ దెబ్బకు నేలకొరిగిన కొబ్బరి చెట్లు(ఫైల్)

- ముంచుకొస్తున్న 'దానా' తుఫాన్
- ఒడిశాలో దాటనున్న తీరం
- నేడు, రేపు భారీ వర్షాలు
- జిల్లా మీదుగా రైళ్ల రాకపోకలు రద్దు

శ్రీకాకుళం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారింది. దీనికి 'దానా'గా నామకరణం చేశారు. ఈ తుఫాన్ ఒడిశాలో తీరం దాటనుండడంతో.. జిల్లాపై పెద్దగా ప్రభావం చూపనుంది. 'బుధవారం భారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు 60 కిలోమీటర్లు వేగవంతంగా ఉంటాయి. గురువారం రెట్టింపుతో ఉండే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకు తీరప్రాంత మండలాల్లో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీచేశారు. రెండు రోజుల పాటు నదీపరివాహక ప్రాంతాలకు, సముద్రం వద్దకు వెళ్లొద్దని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం.. అత్యవసర సేవల్లో ఇబ్బందులు వాటిల్లకుండా... ఏర్పాట్లను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బుధవారం జిల్లాకు

రైళ్ల రాకపోకలు రద్దు

తుఫాన్ నేపథ్యంలో జిల్లా మీదుగా ఒడిశా, పశ్చిమబెంగాళ్ నుంచి వచ్చే రైళ్లను బుధ, గురువారాల్లో రాకపోకలు రద్దు చేశారు. 23న ఇతర ప్రాంతాల్లో రైళ్లు బయల్దేరి.. శ్రీకాకుళం జిల్లామీదుగా 24న పయనించే రైళ్లు రద్దు చేశారు. 24న పశ్చిమబెంగాళ్ రాష్ట్రంలో బయలుదేరే ఫలక్‌నామా, హౌరా-భువనేశ్వర్, హౌరా-తిరుచనాపల్లి, షాలిమర్-చెన్నై సెంట్రల్, షాలిమర్-హైదరాబాద్, ఖరగ్‌పూర్-విలుపురం, సంత్రాగచ్చి-మంగుళూరు, హౌరా-ఎస్ఎంవీటీ బెంగళూర్, వాస్కోడిగామా, హౌరా-చెన్నై, భువనేశ్వర్-సికింద్రాబాద్, పూరి-తిరుపతి వంటి రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు ప్రకటించారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను (మిగతా 6వ పేజీలో...)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అమ్మో.. అక్టోబరు!

- ఈ నెల పేరు చెబితే రైతుల్లో గుబులు
- ఏటా తప్పని విపత్తులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

సోంపేట/ కవిటి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అక్టోబరు వచ్చిందంటే చాలు.. రైతుల గుండెల్లో గుబులు రేగుతుంది. ఏటా అక్టోబరులో పెను తుఫాన్‌లు రావడం.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను ధ్వంసం కావడమే ఇందుకు కారణం. ప్రధానంగా ఉద్దానం ప్రాంతంలో 1999 నుంచీ ఏటా ఏదో ఒక విపత్తు సంభవిస్తూనే ఉంది. ఫైలిన్, హుద్‌హుద్, తితలీ ఇలా పలు తుఫాన్‌లన్నీ అక్టోబరులోనే బీభత్సం సృష్టించి.. కొబ్బరి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. తాజాగా ఈసారి కూడా 'దానా' తుఫాన్ ప్రభావంతో జిల్లాలో రెండు.. మూడురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

6లో



శిబిరంలో భోజనం పెడుతున్న దృశ్యం

ఆకలి తీర్చే సూర్యుడు!

- 295 రోజులుగా అన్నదాన శిబిరం
- ఓ యువకుడి ఔదార్యం
- పవన్ పిలుపుతో సేవా కార్యక్రమం

రణస్థలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

ఆయన ఆర్థికంగా శ్రీమంతుడు కాదు. తాతలు.. తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులేమీ లేవు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. సామాన్య కుటుంబంలో జన్మించి.. తన స్వశక్తితో వ్యాపారం చేసుకొని ఆర్థికంగా ఎంతో కొంత అభివృద్ధి సాధించాడు. అలా వచ్చిన ధనంతో రోజూ కొంతమందికి పట్టెడు అన్నం పెడుతున్నాడు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 295 రోజులుగా అన్నదానం చేస్తున్నాడు. ఆయనే పాతర్లపల్లి గ్రామానికి చెందిన గొర్లె సూర్య(29). తల్లిదండ్రులు ఇద్దరూ రైతు కూలీలే. ఆయనకు జనసేనాని పవన్‌కల్యాణ్ అంటే వీరాభిమానం. పేదలకు పట్టెడు అన్నం పెట్టాలని పవన్ కల్యాణ్ తరచూ చెబుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా డొక్కా సీతమ్మ పేరిట పేద ప్రజల కడుపు నింపాలని పిలుపునిచ్చారు. ఆ పిలుపునకు స్పందించాడు సూర్య. స్వతహాగా కొబ్బరి కాయల వ్యాపారం చేసే సూర్య.. అందులో వచ్చిన కొంత మొత్తాన్ని పేదల కోసం వినియోగిస్తున్నాడు. రణస్థలంలో రామతీర్థం జంక్షన్ వద్ద డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం పేరిట ప్రతిరోజూ అన్నదానం చేస్తుంటాడు.




నిత్యం పదుల సంఖ్యలో అన్నార్తులు అక్కడ భోజనం చేస్తుంటారు. దీనికిగాను సూర్య ఎవరి దగ్గరా విరాళాలు ఆశించలేదు. తన శక్తి ఉన్నంత మేరకు పేదవారి కడుపు నింపాలన్నదే ఆశయంగా చెబుతున్నాడు. అనేక మంది కూటమి, జనసేన నాయకులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించే విధంగా ప్రోత్సహిస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. డిప్యూటీ సీఎం పవన్ పిలుపుతో గత పది నెలలుగా ఈ అన్నదాన ఉద్యమం చేస్తున్నట్టు సగర్వంగా చెబుతున్నాడు. ఇందులో తనకు ఎంతో సంతృప్తి లభిస్తోందని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతానని చెబుతున్నాడు. ఆకలితో వచ్చిన వారికి పట్టెడన్నం పెట్టడంలో ఉన్న సంతోషం మరి దేనిలోనూ లేదని సూర్య అంటున్నాడు.

ఎదుటే దీపం.. ఇంట్లో చీకటి!

- గిట్టుబాటు కాక.. వృత్తిని వదులుకోలేక..
- ఇదీ కుమ్మరుల దీనస్థితి
- దీపావళికి ప్రమిదల తయారీ


చిక్కాలవలసలో ప్రమిదలు తయారు చేస్తున్న సాయి

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున అందరి ఇళ్లలో వెలుగులు నింపే కుటుంబాలవి. కానీ వారి జీవితాల నుంచి చీకట్లు పోవడం లేదు. వారి చేతిలో రూపుదిద్దుకునే ప్రమిదలు... వారి ఇళ్లలో మాత్రం కాంతులు నింపడం లేదు. ఇదీ తరతరాలుగా మట్టి వస్తువులను రూపొందిస్తున్న కుమ్మర్ల దీన స్థితి. దీపావళి పండుగ కోసం చిక్కాలవలస, పోలాకి మండలం చీడివలస తదితర గ్రామాలకు చెందిన కుమ్మరి కుటుంబాలు ప్రమిదలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ ప్రమిదలు తయారు చేయాలంటే ఎంతో నైపుణ్యం అవసరం. కాలువల్లోని జిగురుగా ఉన్న మట్టిని సేకరిస్తారు. ఆ మట్టిని జిగురుతనం వచ్చేవరకూ తొక్కి.. సారె అనే కుమ్మరి చక్రంపై తిప్పుతూ ప్రమిదలు తయారు చేస్తారు. ఎరుపు రంగు వచ్చే వరకు వరిగడ్డితో ప్రత్యేకంగా కాల్చుతారు. వాటిని వివిధ రూపాల్లో... ఆకట్టుకునే డిజైన్లతో తీర్చిదిద్దుతారు. రాను రానూ ప్రమిదల అమ్మకాలు తగ్గిపోతుండడంతో ఆర్థికంగా చితికి పోతున్నారు. అలాగని కొన్ని కుటుంబాల వారు మరో వృత్తి వైపు మళ్లలేకపోతున్నారు. వారం రోజుల నుంచి తన తండ్రితో కలసి రోజుకు 800 వరకూ ప్రమిదలు తయారు చేస్తున్నామని చిక్కాలవలసకు చెందిన అంబటి సాయి చెప్పాడు. ప్రమిదలు విక్రయించడానికి కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నాడు. దీంతో హోల్‌సేల్‌గా ప్రమిద రూపాయి చొప్పున విక్రయించవలసి వస్తోందని తెలిపాడు. ఇలా విక్రయిస్తే పెద్దగా వచ్చేదేమీ ఉండదని నిట్టూరుస్తున్నాడు. అయితే పూర్వీకుల నుంచి వస్తున్న విద్యను వదులుకోలేక ఈ పని చేస్తున్నట్లు చెబుతున్నాడు. మట్టి కుండల వినియోగం తగ్గడంతో తామంతా ప్రత్యామ్నాయంగా ఇటుకలను తయారు చేసుకుంటున్నామని తెలిపాడు.


ప్రమిదలను ఆరబెట్టిన దృశ్యం

ముందస్తు చర్యలు తీసుకోవాలి

(ఐదో పేజీ తరువాయి) ఆదేశించారు. తుపాను నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 24 నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ..'జిల్లాలో నదులు, వాగుల్లో ప్రవాహం పట్ల అప్రమత్తంగా ఉండాలి. తీరప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. శ్రీకాకుళంలో కంట్రోల్ రూమ్ 08942-240557 ఏర్పాటు చేశాం. ప్రజలు అత్యవసర సమయంలో ఫోన్ చేస్తే సిబ్బంది వెంటనే అప్రమత్తమై తగు సహాయం చేస్తారు. ముంపు ప్రాంతాలను గుర్తించి.. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. అధికారులంతా అందుబాటులో ఉండాలి. పారిశుధ్యం విషయంలో జిల్లా పంచాయతీ అధికారి, మునిసిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టాల'ని ఆదేశించారు. నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదుల్లో ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

● ప్రత్యేకాధికారుల నియామకం...

తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని 11 తీరప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రణస్థలం మండలానికి డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ (8008803800), ఎచ్చెర్లకు డ్వామా పీడీ బి.సుధాకరరావు (8790008399), శ్రీకాకుళం మండలానికి డీపీవో కె.భారతి సౌజన్య (83414 93877), గారకు ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ(94408 14582), పోలాకికి జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు (9100997770), సంతబొమ్మాళికి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు (9866530885), వజ్రపుకొత్తూరుకు మత్స్య శాఖ డీడీ పీవీ శ్రీనివాసరావు (94407 16028), సోంపేటకు కార్మిక శాఖ ఏసీ అజయ్ కార్తికేయ (94925 55034), మందసకు పశుసంవర్థకశాఖ ఏడీ పి.చంద్రశేఖర్ (9492416700), కవిటికి ఉద్యాన శాఖాధికారి ఆర్వీ ప్రసాద్ (7995086758), ఇచ్ఛాపురానికి డ్వామా ఏపీడీ సీహెచ్.శ్రీనివాసరెడ్డి (6309998070)లను తుఫాన్ పర్యవేక్షక అధికారులుగా నియమించారు. వీరితో పాటు జిల్లాలోని 30 మండలాల్లో తహసీల్దార్లు ముందస్తు చర్యలతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. .

ఇసుక ఉచితమే!

(ఐదో పేజీ తరువాయి) ఎమ్మెల్యేలకు ఆదేశించారు. ఇసుక సరఫరాలో లోపాలపై చర్చించారు. 'ఇసుక లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లుల బళ్లలో ఇసుక తరలిస్తే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంద'ని ఎమ్మెల్యేలు తెలిపారు. దీంతో ఇకపై ట్రాక్టర్ల ద్వారా అనుకూలమైన ప్రాంతాల్లో ఇసుక తవ్వి.. తరలించుకోవచ్చని సీఎం స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అన్ని ప్రాంతాలకూ సులువుగా ఉచిత ఇసుక వెళ్లే అవకాశం ఉంది. జిల్లాలో శ్రీకాకుళం, ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, పాతపట్నం, కొత్తూరు మండలాల్లో మండలాల్లో ఇసుక అధికంగా తరలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహేంద్రతనయ నదిలో ఇసుకను మెళియాపుట్టి, మందస, సోంపేట, పలాస మండలాలకు తరలించనున్నారు.

ప్రాంతాలను గుర్తిస్తున్న అధికారులు

ప్రస్తుతం నైరా, రామకృష్ణాపురం, చెవ్వాకులపేట వద్ద ఇసుక స్టాక్ పాయింట్లు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రాక్టర్లు, ఎడ్లుల బళ్లతో ఇసుక తరలించేందుకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను భూగర్భ గనులశాఖ అధికారులు గుర్తిస్తున్నారు. మహేంద్రతనయ, నాగావళి, వంశధార నదుల పరిధిలో సుమారు 250 ప్రాంతాల్లో ఇసుక తవ్వుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ట్రాక్టర్ల యజమానులు, భవన కార్మికులతోపాటు నిర్మాణదారులకూ ఊరట లభించనుంది. జిల్లాలో సుమారు 40వేల ట్రాక్టర్లు ఉన్నాయి. ఆయా డ్రైవర్లు, కూలీలందరికీ ఉపాధి దొరికే అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రణస్థలంలో భారీ ఫ్లై ఓవర్!

(ఐదో పేజీ తరువాయి) భూములకు మాదిరిగా పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. మార్కెట్ ధర ప్రకారం సెంటు భూమికి రూ.2లక్షలకుపైగా చెల్లిస్తామని ప్రకటించారు. కానీ అప్పట్లో విపక్షంగా ఉన్న వైసీపీ నేతలు ఈ పరిహారం ఏమూలకు సరిపడదని.. దాని పెంచాలని డిమాండ్ చేశారు. దీంతో రణస్థలంలో రోడ్ల విస్తరణ ప్రక్రియ నిలిచిపోయింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిహారం విషయంలో మాట మార్చింది. సెంటుకు మొదటి అనుకున్నంత ధర ఇవ్వలేమని.. 30 శాతం తగ్గించి ఇస్తామని ప్రకటించింది. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత ప్రారంభమైంది. బైపాస్ నిర్మించాలంటే దాదాపు ఐదు చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టాలి. రైతులకు పరిహారం చెల్లించాలి. ఈ మొత్తం లెక్కలు వేసుకున్న హైవే అథారిటీ అధికారులు మాత్రం రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణానికే మొగ్గు చూపారు. అప్పటికే రైతుల నుంచి సేకరించిన 66 ఎకరాలను తిరిగి వారికి అప్పగిస్తూ ప్రభుత్వం సైతం ఉత్తర్వులు జారీ చేసింది.

పైడితల్లి తెప్పోత్సవం

విజయనగరం రూరల్, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో వెలసిన పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా సిరిమానోత్సవం జరిగిన మరుసటి మంగళవారం తెప్పోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. విద్యుత్ దీపాలతో అలంకరించిన తెప్పపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచారు. మూడు పర్యాయాలు పెద్ద చెరువులో పైడిమాంబ విహరించారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన ఈ ఉత్సవం 6.30 గంటలకు ముగిసింది.



కొత్త పింఛన్లు వచ్చేస్తాయి!

- జనవరి నుంచి అర్హులందరికీ అవకాశం
- త్వరలో దరఖాస్తుల స్వీకరణ

మెళియాపుట్టి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

● మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన మడపాల శ్రీరాములుకి 70 ఏళ్లు దాటినా ఇంత వరకు పింఛను రాలేదు. గత మూడేళ్ల నుంచి దరఖాస్తు చేస్తున్నా... టీడీపీ వర్గీయుడు అనే ఉద్దేశంతో పింఛను ఇవ్వలేదు. ప్రస్తుతం ఆయనకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కలిగింది.

● మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికే చెందిన మడపాల భైరాగికి మూడేళ్ల కిందట ఐడీ నెంబరు 101807579తో పింఛను మంజూరైంది. కానీ డబ్బులు చేతికి అందలేదు. వైసీపీకి వ్యతిరేకంగా తమ కుటుంబం తిరిగిందనే ఉద్దేశంతోనే పక్కన పెట్టారని చెబుతున్నాడు. ఇటీవల జరిగిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబరు నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి... వచ్చే ఏడాది జనవరి నుంచి పింఛన్లు అందజేయనున్నట్టు ప్రకటించడంతో ఆయనతో పాటు వృద్ధులంతా ఊరట చెందుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం జిల్లాలో 3,47,798 మందికి 14 రకాల పింఛన్లను ఇస్తున్నారు. ఇందులో వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత, మత్స్యకారులు, ఒంటరి, తోలుబొమ్మల కళాకారులు, డప్పువాయిద్యకారులు, హిజ్రాలు కలిపి 2,71,708 మంది వరకు ఉన్నారు. వీరికి ప్రస్తుతం రూ.4 వేల వరకు ఇస్తున్నారు. కుష్టు రోగులు 769 మందికి రూ.6 వేలు వంతున ఇస్తున్నారు. పక్షవాత బాధితులు 53 మందికి రూ.15 వేల చొప్పున ఇస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కలవారు 241 మందికి రూ.10 వేల వరకు అందజేస్తున్నారు.

50 రోజుల ప్రణాళిక..

పింఛన్ల కోసం నవంబరు నుంచి దరకాస్తు చేసుకోవ టానికి అవకాశం కల్పిస్తారు. అదే నెలలో తనిఖీ చేస్తారు. అర్హుల జాబితాలు సచివాలయంలో ప్రదర్శిస్తారు. అభ్యంతరాలు వస్తే మళ్లీ తనిఖీ చేపట్టి... జనవరి నాటికి కొత్త పింఛన్లు ఇస్తారు.

కొత్తగా 20 వేల వరకు దరఖాస్తులు?

కొత్తగా మరో 20 వేలు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం వివిధ కారణాలు చూపి సుమారు 5 వేల మంది పింఛన్లను నిలిపివేసినట్టు తెలుస్తోంది. వీరికి కూడా పింఛన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీని వల్ల జిల్లాలో ప్రభుత్వానికి ప్రతినెలా అదనంగా రూ.8 కోట్ల వరకు అదనపు భారం పడనున్నట్టు అధికారుల అంచనా.

అనర్హులకు చెక్..

వైసీపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్నా వారికి వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయించి పింఛన్లు ఇప్పించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ సదరం సర్టిఫికెట్లతో పింఛన్లు పొందిన వారి జాబితాను ఇప్పటికే గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది పేర్లు తొలగించారు. అయినా అనేక చోట్ల ఇంకా అనర్హులు ఉన్నట్టు ఇటీవల సామాజిక తనిఖీల్లో బయట పడడం తెలిసిందే. వీటిని పరిశీలించి...తొలగింపునకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా వచ్చే ఏడాది నుంచి కొత్త పింఛన్లు వస్తాయనే సమాచారంతో అర్హుల్లో ఆనందం కనిపిస్తోంది.


పింఛను అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

అమ్మో.. అక్టోబరు!

- ఈ నెల పేరు చెబితే రైతుల్లో గుబులు
- ఏటా తప్పని విపత్తులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


తితలీ సమయంలో బారువకొత్తూరు వద్ద సముద్రం బీభత్సం

సోంపేట/కవిటి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు నెలంటే సాధారణంగా విజయ దశమి... దీపావళి పండుగలు వస్తాయని... కుటుంబాలతో ఆనందంగా గడపవచ్చని అందరూ అనుకుంటారు. కానీ అక్కడి రైతులకు అక్టోబరు నెల వచ్చిందంటే వెన్నులో వణుకు పుడుతుంది. ఆ నెల ఎప్పుడెప్పుడు పూర్తవుతుందా అని క్షణమొక యుగంగా గడుపుతుంటారు. ఇదీ ఉద్దానం కొబ్బరి రైతుల దుస్థితి. దీనికి ప్రధాన కారణం తుఫాన్ల భయం. 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్ నుంచి 2018లో వచ్చిన తితలీ తుఫాన్ వరకు అన్నీ కేవలం అక్టోబరు, నవంబరు నెలల్లోనే రావటం... పంటలన్నీ తుడిచి పెట్టుకుపోవడమే ఈ ప్రాంతీయుల భయానికి కారణం. ఈ నెల 24, 25 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని.. మరో తుఫాన్ రాబోతోందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తితలీ తుఫాన్ గాయాలను ఇప్పుడిప్పుడే మరచిపోతున్న అన్నదాతలు మళ్లీ ఏ స్థాయి విధ్వంసం చూడాల్సి వస్తుందోనని తల్లడిల్లుతున్నారు.


ఉద్దానంలో కొబ్బరి పంట

అప్పుడు మొదలై...

కొబ్బరి పంటతో కళకళలాడే ఉద్దానం ప్రాంతాన్ని 1999 అక్టోబరు చివరి వారంలో వచ్చిన పెను తుఫాన్ (సూపర్ సైక్లోన్) తీవ్రంగా దెబ్బతీసింది. 2012లో ఫైలీన్, 2014లో హుద్‌హుద్, 2018లో తితలీ తుఫాన్లతో దాదాపు 40లక్షల మేర కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. 2018లో వచ్చిన తితలీ తుఫాన్‌తో కొబ్బరి, జీడి, మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొబ్బరి తోటలు వల్లపు భూముల్లా తయారయ్యాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వరి పంట ఈ ఏడాది పోతే వచ్చే ఏడాదైనా కష్టపడి పండించుకునే అవకాశం ఉంటుంది. కానీ ఒకసారి కొబ్బరి చెట్టు కూలిపోతే మళ్లీ కొత్తగా కొబ్బరి చెట్టు కాపునకు రావాలంటే దాదాపు పదేళ్ల వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో ఉద్దానం కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోయి... వలసలు పోయే స్థితికి చేరుకున్నారు. తాజాగా ఈ నెల 24న బంగాళాఖాతంలో తుఫాన్ వస్తుందని... ఒడిశా సమీపంలో తీరం దాటుతుందనే సమాచారంతో ఉద్దానం రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎప్పుడు ఒడిశా సమీపంలో తుఫాన్ తీరం దాటినా ఈ ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సకాలంలో వానలు పడి కొంతమేర వరి పంట మెరుగ్గా ఉందని రైతులు సంతోషించారు. ఇప్పుడు మళ్లీ వర్షాలు అధికమైతే పొట్ట దశలో తీవ్రంగా దెబ్బ తగులుతుందని ఆందోళన చెందుతున్నారు. తీరప్రాంతంలోని మత్స్యకారులైతే ఎప్పటికప్పుడు తుఫాన్ల తాకిడితో కష్టాల పాలవుతున్నామని కన్నీటిపర్యంతమవుతున్నారు.

ప్రకటనలకే పరిమితం..

ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల... ముఖ్యంగా తుఫాన్ల కారణంగా ఆర్థికంగా నష్టపోతున్న కొబ్బరి, వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి అందే పరిహారం గానీ... సాయం గానీ అంతంత మాత్రమే. తుఫాన్ బాధిత రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ప్రభుత్వాలు ప్రకటించడమే తప్ప పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. ఈసారి తుఫాను ప్రభావం లేకుండా చూడాలని ఓవైపు దేవుళ్లను ప్రార్థిస్తూనే.. .మరోవైపు కష్టాల నుంచి తాము శాశ్వతంగా బయట పడేలా ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని ఉద్దానం రైతులు వేడుకుంటున్నారు.

ఆర్‌అండ్‌బీ పనులు పూర్తిచేయండి: కలెక్టర్



కొత్త కలెక్టరేట్ భవనం గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న కాంట్రాక్టరు, సిబ్బంది

శ్రీకాకుళం, కలెక్టరేట్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్‌అండ్‌బీ పనులు సత్వరమే పూర్తిచేసేందుకు చర్యలుతీసుకోవాలని ఆ శాఖ ఎస్‌ఈని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లాలో నిర్మిస్తున్న వివిధ ప్రాజెక్టుల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులపై అడిగితెలుసుకున్నారు. పనులను కాంట్రాక్టరు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. బిల్లులు పెండింగ్‌లో ఉంటే ఆ జాబితాను అందజేయాలని ఆదేశించారు. వనితమండలం పోలాకి హైలెవెల్ క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పోలీసు, ఎంపీడీవో తదితర కార్యాలయాలు మార్చాలని కోరారు. కళింగపట్నం-శ్రీకాకుళం - పార్వతీపురం రోడ్డు పనులపై కూడా సమీక్షించారు. రహదారి పనులు సత్వరమే పూర్తి చేయాలని, రహదారికి ఇరువైపులా బ్యూటిఫికేషన్ పనులకు సంబంధించి పార్కింగ్, మరుగుదొడ్లు, సైకిల్ ట్రాకింగ్, ఫుట్‌పాత్, గ్రీనరీ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఇంజినీర్లను ఆదేశించారు. పెద్దపాడు చెరువు డీపీఆర్‌పై చర్చించారు. సమావేశంలో ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సుధాకర్, ఈఈ, డీఈలు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధంచేయండి

అరసవల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఈనెల 31 నాటికి ఓటరు జాబితా తయారు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ రాజ్, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఇళ్ల పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 70వేల ఉపాధి హామీ పనిదినాల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పంచాయతీల్లో ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని, రక్షితమంచినీటి ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. కార్యాక్రమంలో డీఆర్వో అప్పారావు, వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, డీపీవో భారతి సౌజన్య, ఇరిగేషన్ ఎస్ఈ పి. సుధాకర్, సీపీవో ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలవాలి

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఎచ్చెర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో ఎచ్చెర్ల నియోజకవర్గం జిల్లాకే ఆదర్శంగా నిలవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. మంగళవారం ఎచ్చెర్లలో పార్టీ సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో పారదర్శకం పనిచేసేవారికి సరైన గుర్తింపు లభిస్తుందనడానికి తానే ఉదాహరణ అని చెప్పారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బెందు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, కొమరాపు రవి, నేతలు మెండ రాజారావు, పంచిరెడ్డి సత్యనారాయణ, గాలి వెంకటరెడ్డి, చౌదరి అవినాష్, గూరు జగపతిబాబు, అన్నెపుభువనేశ్వరరావు, మూకళ్ల భాస్కర రావు, భీమారావు పాల్గొన్నారు.

సాగు ఖర్చులు తగ్గించి ఉత్పాదకత పెంచాలి: ఏవో



అరిణాం అక్కివలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏవో తదితరులు

ఎచ్చెర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగులో ఖర్చును తగ్గించి ఉత్పాదకతను పెంచుకోవాలని ఏవో వై.సురేష్ సూచించారు. మంగళవారం అల్లినగరం, అరిణాంఅక్కివలసల్లో నిర్వ హించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అరిణాం అక్కివలస సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, కూటమి నేతలు గట్టెం శివరామ్, పుంగ్రోతు శంకర్, బాలకృష్ణ, రమణమూర్తి పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

కంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను వేగవంతంచేయాలని మండల ప్రత్యేకాధికారి జయరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కంచిలిలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, హౌసింగ్ ఏఈ దిలీప్ పాల్గొన్నారు.

922 ఎన్టీఆర్ గృహాల గుర్తింపు

బూర్జ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో 922 ఎన్‌టీఆర్ హౌసింగ్ గృహాలను గుర్తించినట్లు హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు. హరిపురం, పల్లాపురంలో పాతఎన్‌టీఆర్ గృహాలను పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో రూపాయి బిల్లుపడని వారికి కూడా బిల్లులు మంజూరు చేస్తామన్నారు.కార్యక్రమంలోపోలయ్య, జడ్డు కృష్ణ, చిన్ననాయుడు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

హామీలపై దృష్టి సారించండి

కంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిసారించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు హితవు పలికారు. మంగళవారం జక్కరలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇప్పిలి కృష్ణారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 120 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎటువంటి మేలుచేయలేదన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై అవగాహన

ఇచ్ఛాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పురపాలక సంఘం బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)పై కౌన్సిలర్లకు టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్ మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, కౌన్సిలర్లు పి.మధుమూర్తి, ఎ. లీలారాణి, బి.జగన్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

స్తంభాలు ఏర్పాటు చేయండి

ఇచ్ఛాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని 11వ వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ ఆశి లీలారాణి కోరారు. కమిషనర్ ఎన్.రమేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గౌడవీధిలో ఐరన్ స్తంభాన్ని మార్చాలని కోరారు.



రోడ్డుపై ఏర్పడిన గొయ్యి వద్ద చెట్టు కొమ్మలు అడ్డుగా పెట్టిన దృశ్యం

ఆదమరిస్తే ప్రమాదం సుమా!

● పాలవలస జంక్షన్‌లో ప్రధాన రహదారి మధ్యలో గొయ్యి పూడ్చని వైనం

బూర్జ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవలస జంక్షన్ వద్ద ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యి వద్ద ప్రమాదం పొంచిఉంది. ఇక్కడ రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యిపై చెట్ల కొమ్మలు కప్పి ఉంచారు. ఏపాటి ఆదమరిచినా వాహనాలు గొయ్యిలోకి దిగబడే ప్రమాదముంది. పాలకొండ- శ్రీకాకుళం రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ప్రధానంగా ఈ మార్గంలో చీకటి పడిన తర్వాత రాకపోకలు సాగించే వాహనాలు అటుగా వెళ్తే ప్రమాదం తప్పదన్న ఆందోళన నెలకొంది. ఆర్‌అండ్‌బీ అధికారులు గొయ్యిని పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.



గార: పోలీసుల విధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జనార్దనరావు



జి.సిగడాం: ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ

పోలీసు స్టేషన్లలో 'ఓపెన్ హౌస్'

శ్రీకాకుళం క్రైం,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసకావడం వల్ల జీవితాలు నాశనమైపోతాయని వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం శ్రీకాకుళంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో భాగంగా పలు కళాశాలలకు చెందిన విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ-2 కృష్ణారావు,రైటర్ రవి పాల్గొన్నారు. కాగా శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌లో సర్కిల్ సీఐ కె.పైడపునాయుడు, ఎస్ఐ రాము, టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ సంతోష్‌లు.. ఓపెన్ హౌస్‌లో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● గార, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గార పోలీసు స్టేషన్‌లో అమర వీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని మంగళవా రం ఓపెన్ పోలీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ నిర్వహణ, నేరాలు నియంత్రణ ట్రాఫిక్ నిబంధనలు, దొంగతనాల్లో శిక్షలు, శాంతి భద్రతలు పరిరక్షణపై ఎస్ఐ ఆర్.జనార్దనరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● జి.సిగడాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జేఆర్‌పురం సీఐ అవతారం కోరారు. జి.సిగడాం ఆదర్శపాఠశాలలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేజీబీవీలో ఇంటర్ విద్యార్థుల అదృశ్యంపై ఆరా తీశారు. పాఠశాల ప్రత్యేకాధికారి , సిబ్బందికి సమాచారంఅడిగితెలుసుకున్నారు.ఆయన వెంట ఎస్ఐ మధుసూదనరావు ఉన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

శ్రీకాకుళం క్రైం: పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీ ప్రసాదరావు తెలిపారు. అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా నక్సల్స్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పి.కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను శ్రీకాకుళంలోని వారి నివాసంలో మంగళవారం కలుసుకున్నారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

● వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

గుజరాతీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్‌పై జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమున్న చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వైద్య, రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి అవసరం మేరకు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూ తుఫాన్ తీవ్రతపై క్షేత్రస్థాయి సమాచారం తెలుసు కుంటున్నారు.

ధాన్యం సేకరించాలి

సరుబుజ్జిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి సక్రమంగా ధాన్యం సేకరించాలని తహసీల్దార్ ఎల్.మధుసూదన కోరారు. సరుబుజ్జిలిలో మిల్లర్ల యజ మానులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, ఏవో పద్మనాభం పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఇచ్ఛాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.యోగేశ్వరి రాష్ట్రస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హైజంప్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జె.సరోజిని తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి అండర్-19 హైజంప్ పోటీల్లో యోగేశ్వరి సత్తాచాటడంతో కర్నూలులో ఈనెల 25, 26 తేదీల్లో జరగనున్న పోటీల్లో పాల్గొనుందని చెప్పారు.

వైద్య సిబ్బంది పర్యటన

పొందూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పొందూరులో నిపలు వీధుల్లో తాడివలస పీహెచ్‌సీ వైద్యసిబ్బంది మంగళవారం పర్యటించి వివరాలు సేకరించారు. విజయనగరం జిల్లాలో డయేరియావిజృంభిస్తుండడంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు దృష్టిసారించారు. ఈనేపథ్యంలో పట్టణంలో సీహెచ్‌సీకి ప్రతిరోజు ఇద్దరు ముగ్గురు రోగులు డయేరియా వ్యాధితో చికిత్సకోసం చేరుతుండడంతో తాడివలస వైద్యులు రమేష్‌నాయుడు, నవీన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వీధుల్లో తిరిగి రోగుల వివరాలు సేకరించారు.

న్యాయ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 3,5 ఏళ్ల న్యాయ కోర్సుల పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడేళ్ల కోర్సుకు సంబంధించి 2,4 సెమిస్టర్లకు, ఐదేళ్ల కోర్సుకు సంబంధించి 2,4,8 సెమిస్టర్ల పరీక్షలు మొదలయ్యాయి. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వర కు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

యూబీఏలో భాగస్వామ్యం పెరగాలి

ఎచ్చెర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నూతన గ్రామీణ ఆవిష్కరణ కోసం ఉన్నత్ భారత్ అభియాన్‌లో(యూబీఏ) విద్యా సంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని కోరారు. మంగళవారం వర్సిటీలో ప్రాంతీయ సమన్వయ సంస్థ (విశాఖ) సహకారంతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

రిటైర్డ్ పీడీ మృతికి సంతాపం

గుజరాతీపేట, ,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల రిటైర్డ్ పీడీ సిరిపురపు కన్నంనాయుడు మంగళవారం మృతిచెందారు. సంతకవిటి మండలంలోని బూరాడేపేటకు చెందిన ఆయన శ్రీకాకుళంలోని పీఎన్‌కాలనీలో 30 ఏళ్లుగా నివాసముంటున్నారు. ఎస్‌కే నాయుడు మృతి పట్ల చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, బొత్స సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు మీసాల నీలకంఠం, గొర్లె కిరణ్, డోల జగన్, ఎంవీ పద్మావతి, సురంగి మోహన రావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం

గుజరాతీపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయా విభాగాల మేజర్, మైనర్ కోర్సుల పాఠ్య ప్రణాళికలు, మోడల్ పేపర్స్, యాడ్ ఆన్, సర్టిఫికెట్, షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ సర్టిఫికెట్ కోర్సులపై చర్చించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వైగీతా,శ్రీకాంత్ పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో మంగళవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ 34వ సీనియర్ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌వీడీ మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అర్జునరావు రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జి.సిగడాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పొందూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జోత్స్న తెలిపారు. మంగళవారం జి.సిగడాం ఆదర్శ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అన్నాశ్యామూల్ లెంక పాల్గొన్నారు.

పొందూరులో విద్యార్థుల ఇక్కట్లు

పొందూరు,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):పొందూరు ప్రభుత్వోన్నత పాఠశాల మంగళవారం సకాలంలో తెరవకపోవడంతో పదో తరగతి విద్యార్థులు ఇబ్బందిపడ్డారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు ఉదయం ఎనిమిది నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంది. దీంతో విద్యార్థులు ఉదయం 7.45 గంటలకే పాఠశాలకు చేరుకున్నా గేటు తెరవకపోవడంతో బయటే వేచిఉండాల్సి వచ్చింది. విద్యార్థులు పెద్దసంఖ్యలో గుమి గూడడంతో అక్కడి చేరుకున్న పోలీసులు సైతం వాకబు చేశారు. అయితే పాఠశాల సిబ్బంది ఉదయం 8.45 గంటలకు వచ్చి గేటు తాళాలు తెరవడంతో విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లారు. కాగా పాఠశాల తెరవడంత ఈరోజు మాత్రమే ఆలస్యమయ్యిందని హెచ్‌ఎం వెంకటరావు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి

ఎచ్చెర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీల సర్దుబాటు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యుడు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఎచ్చెర్లలో సీపీఎం మహా సభ జరిగింది.

జీవో-117 రద్దుచేయాలి

రణస్థలం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జీవో-117 రద్దు చేసి, ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ప్రాథమిక పాఠశా లలుగా కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ .కిషోర్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని కొండ ములగాం, డి.మత్స్యలేశం తదితర పాఠశాలను సందర్శిం చారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

గుజరాతీపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ఈనెల 25వ వరకు అపరాధ రుసం లేకుండా, 26 నుంచి 31వ తేదీ వరకు రూ.200ల అపరాధ రుసుమతో, ఈనెల 30, 31వ తేదీ వరకు 500 రూపాయల అపరాధ రుసుముతో చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ దరఖాస్తును ఆన్‌లైన్ చేయించుకున్న తర్వాత వచ్చిన రిఫరెన్స్ నెంబర్ ఆధారంగా ఫీజును అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని తెలిపారు.

ఐఆర్ ప్రకటించాలి

ఆమదాలవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర భృతి(ఐఆర్)ను 30 శాతం వెంటనే ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో పెన్షనర్ల సంఘ కార్యవర్గ సమావేశం సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన నిర్వహించారు.కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, సభ్యులు దాస్యం లక్ష్మణరావు, ఎస్.చంద్రశేఖరరావు, కె.కోటేశ్వరరావు, పి.భానోజీరావు, బి.నారాయణరావు, బి.చిట్టియ్య, బలివాడ వెంకటరమణ గోవిందరావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

నందిగాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కవిటిఅగ్రహారం సమీపంలో బెండిగేడు-పూండి మార్గంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కవిటిఅగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మాళి తిరుపతిరావు ద్విచక్రవాహనంపై పూండి వెళ్తుండగా అదే గ్రామ సమీపంలో హైవేపై పూండి నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో తిరుపతిరావు కుడికాలు, కుడి చేయికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మంగళవారం తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అమీర్ అలీ తెలిపారు.

కేజీబీవీ విద్యార్థినుల ఆచూకీ లభ్యం

● ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో గుర్తింపు

జి.సిగడాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం కేజీబీవీ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థినులు రెడ్డి భార్గవి, తలారి లిఖిత ఆచూకీ లభ్యమైంది. ఈమేరకు వారి ద్దరూ మంగళవారం ఆమదాలవలస రైల్వేసేషన్‌లో పట్టుబడ్డారు. ఇక్కడ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న ఆనందపురానికి చెందిన భార్గవి, రాజాం మండలంలోని వస్త్రపురి కాలనీకి చెందిన లిఖిత సోమవారం వేకువ జామున కళాశాల గోడ దూకి అదృశ్యమైన సంగతి విదితమే. వీరిద్దరూ మంగళవారం ఆమదాలవలస రైల్వేసేషన్‌లో పట్టుబడగా శ్రీకాకుళం సీడ బ్ల్యూసీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆమదాలవలస జీఆర్పీ పోలీసుల సహకారం, సమాచారంతో జి.సిగడాం పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు పాఠశాల సిబ్బంది సమక్షంలో అప్పగించారు. వసతి గృహంలో ఉండి చదువుకోవడం ఇష్టం లేకనే పాఠశాల నుంచి వెళ్లిపోయామని విద్యార్థినులు పోలీసులకు తెలిపారు. ఇద్దరం గుంటూరులో ఉంటున్న భార్గవి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పోయేందుకు సిద్ధమయ్యామని వారు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● స్కూల్ బస్సును ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్


ప్రైవేటు బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్

ఆమదాలవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంశధార నదీతీరం చెవ్వాకులపేట నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ రామచంద్రాపురం వద్ద మంగళవారం ఓ ప్రైవేటు బస్సును ఢీకొట్టింది. గ్రామస్థుల కథనం మేరకు.. ట్రాక్టర్ డ్రైవర్ అతి వేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు ముందు భాగంలో ఢీకొట్టాల్సిన ట్రాక్టర్ వెనుక భాగానికి ఢీకొట్టింది. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో రహదారిపై మంగళవారం ఇసుక ట్రాక్టర్ బోల్తాపడింది. వంశధార నదీతీరం చెవ్వాకులపేట ర్యాంప్ నుంచి ఇసుక తరలిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఆ సమయంలో ప్రయాణికులు, ట్రాక్టర్‌పై కూలీలు కూడా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

భర్త మృతి చెందిన రెండు రోజుల్లోనే..

● మనస్తాపంతో భార్య కూడా..
● సత్రాం గ్రామంలో ఘటన


చిన్నకుమారుడితో తల్లిదండ్రులు ధర్మారావు, తవిటమ్మ (ఫైల్)

నరసన్నపేట/ జలుమూరు (సారవకోట), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మూడు ముళ్ల బంధం.. ఏడడుగుల అనుబంధంతో జీవితాంతం కలిసి మెలిసి ఉంటామని తాళి కట్టిన భర్త మృతి చెందిన విషయం తెలిసి భార్య మనస్తాపానికి గురై మృత్యువాత పడిన ఘటన సారవకోట మండలం సత్రాం గ్రామంలో చోటుచేసుకుంది.. గ్రామానికి చెందిన గుండ ధర్మారావు (74) అనారోగ్యంతో ఆదివారం ఇంటి వద్ద మృతిచెందారు. అప్పటికే ఆయన భార్య తవిటమ్మ (68) అనారోగ్యంతో నరసన్నపేటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. భర్త మృతిచెందిన విషయం తెలియదు.. ఆసుపత్రి నుంచి మంగళవారం డిశ్చార్జి అయిన తవిటమ్మను కుటంబ సభ్యులు ఇంటికి తీసుకువెళ్లారు.. అక్కడ పరిస్థితులు గమనించిన తవిటమ్మ భర్త ఎక్కడ అని రెండో కుమారుడు మోహనరావును అడిగింది. తండ్రి మృతిచెందాడని అతడు చెప్పడంతో మనస్తాపానికి గురై ఆమె ప్రాణం విడిచింది. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారి మనో వేదనకు గురయ్యారు. మృతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాతపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రగ్బీ పోటీలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎ.రుధికుమార్, సీహెచ్ మౌళి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.హేమసుందర్ తెలిపారు. ఏలూరులో డా.బీఆర్ అంబేద్కర్ పెద్దవేగిలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం పొందారన్నారు. బీహార్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీలలో అండర్-19 విభాగంలో పాల్గొంటారన్నారు.

సభ్యత్వ నమోదు చురుగ్గా సాగాలి

పోలాకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం ఈదులవలస కల్యాణ మండపంలో సభ్యత్వనమోదుపై పార్టీ క్యాడర్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 26 నుంచి సభ్యత్వ నమోదును ప్రారంభించాలన్నారు. క్లస్టర్, యూనిట్ ముఖ్యనాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, క్లస్టర్, యూనిట్, జిల్లా రాబిన్‌శర్మ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాలనీల్లో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజ్ సూచించారు. మంగళవారం జమ్ము లోని ప్రభుత్వ లే అవుట్‌ను పరిశీలించారు. నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో మధుసూదనరావు,హౌసింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు కొమరం భీమ్

పాతపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆశయసాధన కోసం ప్రాణాలను అర్పించిన గొప్ప పోరాట యోధుడు కొమరం భీమ్ అని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. కొమరంభీమ్ 123వ జయంతి ఉత్సవం సందర్భంగా స్థానిక వైటీసీ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘం సభ్యులు జి.అప్పన్న పి.సురేష్, జె.వాసు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

మందస,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటుచేసిన ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలిపారు. కొత్త ఆధార్ కార్డులు, బయోమెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్ మార్పు, 5 ఏళ్ల చిన్నారులకు బాలాధార్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో వివిధ గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

హిరమండలం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యాళ్ల నాగేశ్వరరావు, పి.శ్రీధర్, టి.శంకరరావు, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇటు నిరుపయోగం.. అటు అద్దె భారం

● ప్రభుత్వ ఖజానాకు గండి


ఖాళీగా ఉన్న ఏరియా ఆసుపత్రి (ఇన్‌సెట్‌లో) అద్దె భవనంలో కొనసాగుతున్న గనుల శాఖ కార్యాలయం



టెక్కలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్, నియోజకవర్గ కేంద్రం టెక్కలిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఎదుర వుతోంది. దీంతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారమవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి.. జిల్లాలో అత్యధిక రెవెన్యూను సమకూర్చే గనులు, భూగర్భ శాఖ కార్యాలయంతో పాటు ఆర్డీవో, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం, సహాయ కార్మికశాఖ కమిషనర్, ఉప ఖజానాశాఖ, సమగ్ర శిశు సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమశాఖ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తు న్నారు. అద్దె భారాలు మోయలేక అటవీశాఖ, ఎక్సైజ్ ఏఈఎస్, వాణిజ్య పన్నులు తదితర శాఖల కార్యాల యాలు ఇక్కడి నుంచి తరలిపోయాయి. ఓవైపు అద్దెల భారం, మరోవైపు నెలనెలా విద్యుత్ చార్జీలు చెల్లించేందుకు ఆయా శాఖలు కుస్తీలు పడాల్సి వస్తోంది.

అమలుకాని ఎన్టీఆర్ ఆలోచన

1994లో టెక్కలి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎన్‌టీ రామారావు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండాలన్న ఆలోచన చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. అయితే 1994లో ఎన్టీఆర్ వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేశారు. ఏరియా ఆసుపత్రి 200 పడకల కేంద్ర ఆసుపత్రిగా రూపాంతరం చెందగా వంశధార కాలనీలో కొత్త భవనాల నిర్మాణం చేపట్టి అక్కడికి తరలించారు. దీంతో 1996లో నిర్మించిన ఏరియా ఆసుపత్రి భవనాలు నేటికీ వృథాగా ఉన్నాయి. ఇక్కడ విశాలమైన గదులు, మౌలిక వసతులున్నప్పటికీ వివిధ శాఖలు మాత్రం ఈ భవనాల్లోకి వచ్చేందుకు ఇష్టపడడం లేదు. కార్యాలయాలకు వేర్వేరు గా భవనాలు ఉండడం వల్ల ఉద్యోగులు రాకపోకలకు అనువుగా ఉంటుందని, అనువైన సమయాలుంటాయనే ఉద్దేశంతో ఈ భవనాల్లోకి వచ్చేందుకు ఇష్టపడడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాలకు చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి వివిధ శాఖలకు కేటాయిస్తే ప్రభుత్వంపై అద్దె భారాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే కార్యాలయాలన్నీ ఇకేచోట ఉండడం వల్ల ప్రజలకు అనుక లంగా ఉంటుందని అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ దిశలో స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: డీఐజీ


పోలాకి: మొక్క నాటుతున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

నరసన్నపేట/పోలాకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రోజుకొక విధానం అనుసరిస్తున్నారని వారిపై అప్రమత్తంగా ఉండాలని డీఐజీ గోపినాథ్ జెట్టి అన్నారు. మంగళవారం నరసన్నపేట సీఐ కార్యాలయం, పోలాకి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు నుంచి వచ్చిన కాల్స్‌ను నమ్మవద్దని, అప్రమత్తం గా ఉండాలని, వారితో ఎటువంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించవద్దని సూచించారు. పోలీసులు, సీబీఐ ఇతర నిఘా సంస్థల వ్యక్తులమంటూ సీన్ క్రియేట్ చేసి వీడియో కాల్స్ చేసినా వాటిని నమ్మవద్దన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా 'సంకల్పం' పేరుతో కళాశాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థతో ప్రజలతో మరింత మమేకమవుతామన్నారు. అంతకు ముందు పోలీసు క్వార్టర్లను పరిశీలించారు. పోలాకి మండలం వనవిష్ణుపురంలో జరిగిన హత్యపై డీఐజీ ఆరా తీశారు. గతంలో పోలాకి స్టేషన్ నుండి రెండు సైబర్‌కేసులు నమోదయ్యాయని మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఉంటున్న వారి జాడ తెలుసుకుని వారికి నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, నరసన్నపేట, పోలాకి, సారవకోట ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్‌కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై 1930కి ఫోన్ చేయండి

పోలాకి/శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1930లో సంప్రదించాలని డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు. పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ.. నేరం జరిగిన కొద్ది గంటల్లో ఈ నెంబరుకు ఫోన్ చేయడం ద్వారా తప్పక న్యాయం జరుగుతుందన్నారు. నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ 1800-11-4000, సైబర్‌క్రైం.జీఓవి. ఇన్‌లోనూ ఫిర్యాదు నమోదు చేయాలని, అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలను అందించాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు వయసులో ఉన్న వారిని, ప్రత్యేకంగా వృద్ధులను సులభంగా టార్గెట్ చేస్తున్నారన్నారు. మీ మొబైల్ నెంబర్ అక్రమ కార్యకలా పాలకు సంబంధించినదని, టీఆర్ఏఐ నుంచి సేవలు నిలిపివేస్తామని చెప్పి మోసం చేస్తారని, అసలు టీఆర్ఏఐ సంస్థ ఎటువంటి సేవలు నిలిపివేయదని, కేవలం టెలికాం సంస్థలు మాత్రమే సేవలను నిలిపివేస్తాయన్న విషయాన్ని ప్రజలు గుర్తెరగాలన్నారు. ఈకేవైసీ కోసం ఏ బ్యాంకులు లింకులను పంపరని, అటు వంటివి ఏవైనా వస్తే వెంటనే బ్యాంకులను సంప్రదించాలన్నారు. అధిక లాభాలకు ఆశపడి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు.

రైతు సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

నరసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వేతో రైతులు ఇబ్బం దులు పడుతున్నారని, వాటిని తొలగించేందుకే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం యారబాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నాయకులు శిమ్మ జగన్నాథం, పూతి రమణ, ఎస్వీ రమణ, పూతి నర్సయ్య పాల్గొన్నారు.


పాతపట్నం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు


నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు

సమస్యలకు శాశ్వత పరిష్కారం

పాతపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని భూ సమస్యలను ఎన్డీఏ ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. ఏఎస్‌కవిటి గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. నేలబొంతు గ్రామస్థుల వినతి మేరకు రోడ్డు నిర్మాణాన్ని వేసవిలోగా చేపడ తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో గ్రామాల్లో అభివృద్ధి బాట పడుతున్నాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మహాదేవిపురం, బట్టుపాడు, పీఎంపురం, నువ్వల రేవు, వజ్రపుకొత్తూరు, కిడిసింగి, చిన్నవంక, బైపల్లి, అక్కుపల్లి, గరుడభద్ర, రాజాం గ్రామాల్లో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, గొరకల వసంత స్వామి, చాణక్య, వి.దుర్గారావు, ఎ.ఉమామహేశ్వరరావు, శశిభూషణ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎండల మల్లన్న ఆలయ ఈవోగా గురునాథరావు

టెక్కలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం రావివలస ఎండమల్లికార్జునస్వామి ఆల య కార్యనిర్వహణాధికారిగా జి.గురునాథరావును నియమిస్తూ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ● స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీలను మంగళవారం తెరిచి లెక్కించారు. ఈ సందర్భంగా రూ. 36,604 ఆదాయం వచ్చినట్లు ఈవో రాధాకృష్ణ తెలిపారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

మెళియాపుట్టి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆధ్యాత్మిక గురువు టీకే మంజునాథ్ అన్నారు. స్థానిక ఓంశాంతి భవన్‌లో 'సంతోషకమైన జీవనం'పై మంగళవారం సదస్సు నిర్వహించారు.

మాజీ మంత్రి అప్పలరాజు తీరు మారలేదు..

పలాస, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ నాయకులు నోటి దురద తగ్గించుకున్నా మాజీ మంత్రి అప్పలరాజు మాత్రం ఇంకా తీరు మార్చుకోలేదని, ప్రజలే ఆయనకు తగ్గిస్తారని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పలాసలో ఇద్దరు బాలికలు అత్యాచారానికి గురైతే ఎమ్మెల్యే గౌతు శిరీష తక్షణం స్పందించి బాధ్యతాయుతంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిందితులకు కఠిన శిక్షలు పడాలని కోరారని, అయితే దీనిని కూడా అప్పలరాజు రాజకీయం చేస్తూ తమ నాయ కురాలిపై నిందలు వేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు మాట్లాడుతూ.. మచ్చలేని ఎమ్మెల్యే శిరీషపై నిందలు తగవన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్తా, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, యవ్వారి మోహనరావు, కుత్తుమ లక్ష్మణరావు, డొక్కరి శంకర్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

పలాస, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అత్యాచార బాధిత కుటుంబాలను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాచార నిందితులతో టీడీపీ నాయకులకు సంబంధాలున్నాయని, కేసు రాజీ చేసేందుకు ఎమ్మెల్యే శిరీష ప్రయత్నాలు చేశారని విమర్శించారు. అత్యాచారం విషయం 24 గంటలైనా బయటకు పొక్కక పోవడానికి కారణా లేమిటని ప్రశ్నించారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

కోర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

టెక్కలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలో కోర్టు సముదాయం, న్యాయాధికారి బంగ్లా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద కోరారు. ఈ మేరకు మంగళవారం బీసీ, ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి జనార్దన రెడ్డిని విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

బీసీ వసతి గృహం పరిశీలన

జలుమూరు, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగంలోని బీసీ వసతిగృహాన్ని మండల ప్రత్యేకాధికారి జె.నాగలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఆ సమయానికి వార్డెన్ లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 82 మంది విద్యార్థులుంటే మూడు మరుగుదొడ్లు ఉండడంపై అసహనం వ్యక్తంచేశారు. ఎంపీడీవో కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంక్‌లు శుభ్రంగా ఉంచాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే వాటర్ హెడ్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో టి.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం సంతబొమ్మాళి పంచాయతీ శివరాంపురంలో ట్యాంక్‌ను పరిశీలించారు. ఎంపీడీవో పి.జయంతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

సకాలంలో బిల్లుల చెల్లింపు

● ప్రసాద్‌పండా, ఎంపీడీవో



మెళియాపుట్టి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'పల్లె పండగలో గుర్తించిన పనులకు బిల్లులను సకాలంలో చెల్లిస్తామని ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. బిల్లు చెల్లింపులపై ప్రతివారం సమీక్షిస్తామన్నారు.

ప్ర: రాజకీయ నాయకులకే పనులు కేటాయిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి?

జ: అటువంటిదేమీ లేదు. గ్రామస్థుల తీర్మానం మేరకు పనుల ఎంపిక చేస్తున్నాం. ఎప్పుడూ లేనివిధంగా ప్రజలే మాకు ఈ పనులు కావాలని కోరిన తరువాతే మంజూరు చేస్తున్నాం.

ప్ర: పల్లెపండగ పనులకు ఎంత నిధులొచ్చాయి?

జ: మండలంలో మొదటి విడతలో రూ. 80 లక్షల వరకు ఎమ్మెల్యే గోవిందరావు ప్రతిపాదనలతో మంజూరయ్యాయి. పనుల్లో నాణ్యలా లోపాలు లేకుండా చేస్తాం.

ప్ర: ప్రస్తుతం కార్యదర్శుల కొరత ఉందా?

జ: ఉంది. ఇటీవల కొందరు కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. మెళియాపుట్టి, చీపురుపల్లి, వసుంధర, మర్రిపాడు-కె పంచాయతీలకు కార్యదర్శులు లేరు.

ప్ర: కార్యాలయం శిథిలావస్థలో ఉంది కదా?

జ: వాస్తవం. ప్రతిరోజు భయభయంగా విధులు నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

న్యూస్ బాక్స్

బీజేపీలోకి వైసీపీ నేతలు

కొత్తూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనప గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులు సుమారు 200 కుటుంబాలు మంగళవారం బీజేపీలో చేరాయి. వీరికి ఆ పార్టీ నాయ కుడు సిరిపురం తేజేశ్వరరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. వనప పంతులు సమక్షం లో కొయిలాపు వెంకటరావు, పల్ల జగదీష్, దాసరి దాలయ్య, వలరౌతు నారాయణరావు తదితరులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడేల భూపతి, పార్టీ మండల అధ్యక్షుడు నరసింహమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి బూరాడ భాస్కరరావు, సరాలి సర్పంచ్ పడాల షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి

నందిగాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లపై కార్యదర్శులు దృష్టి సారిం చాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో గోపిబాల సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పన్ను వసూలుపై నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. అల్పపీడన ప్రభావం నెలకొని ఉన్నందున గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అంత కు ముందు పలు గ్రామాల్లో రక్షిత నీటి పథకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.రాజారావు పాల్గొన్నారు.

స్టోన్‌క్రషర్లలో విజిలెన్స్ తనిఖీ

టెక్కలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): టెక్కలి పరిధిలోని భవానీ, లట్టిగాంలోని కొత్తమ్మతల్లి స్టోన్ క్రషర్లను మంగళవారం విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ నేతృత్వంలో గనులు భూగర్భశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. మెటీరియల్ నిల్వలు, రికార్డులు తనిఖీ చేసినట్లు సమాచారం.

ఆదిఆంధ్రా వీధిలో వైద్య శిబిరం

టెక్కలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదిఆంధ్రా వీధిలో జ్వర పీడితులను దృష్టిలో పెట్టుకొని మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా నుంచి వచ్చిన వైద్యాధికారుల రోగులకు రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.